తెలుగు దినపత్రిక
డైలీ రిపోర్ట్
DAILY REPORT
ఎడిటర్: బక్క రవీందర్
శనివారం 10, ఆగస్టు 2024

సంగారెడ్డి జిల్లాలో బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య.!

3లో

సమస్య ఏదైనా

దాని వెనుక ఎవరున్నా....
నిజాన్ని నిభయంగా చూపిస్తాం
మీకు తెలిసిన ప్రజల సమస్యలు
మాకు తెలియజేయండి.
ఇండిపెండెంట్ జర్నలిజానికి
వేదిక.. మీ డైలీ రిపోర్ట్
ఫోన్ నెంబర్
8501919707

సీఎం రేవంత్ అమెరికా టూర్‌లో
పెట్టుబడుల వెల్లువ

- హైదరాబాద్‌లో ఆమ్‌జెన్ కొత్త రీసెర్చ్ సెంటర్
- ఈ ఏడాది చివర్లో ప్రారంభం..
- మూడు వేల మందికి ఉద్యోగాలు
- యూఎస్‌లో రేవంత్ బిజీ బిజీ.. వరసగా కంపెనీ ప్రతినిధులతో చర్చలు

2

అమెరికా: ప్రపంచంలోని అతిపెద్ద బయో టెక్నాలజీ కంపెనీల్లో ఒకటైన ప్రఖ్యాత ఆమ్‌జెన్ తెలంగాణలో కార్యకలాపాలను విస్తరించనుంది. హైదరాబాద్‌లో కొత్తగా రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ విభాగం ప్రారంభించనున్నట్లు కంపెనీ ప్రకటించింది. అమెరికా పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు , ఉన్నతాధికారుల బృందం శాన్ ఫ్రాన్సిస్కోలోని ఆమ్‌జెన్ ఆర్ అండ్ డీ కేంద్రంలో ఆ కంపెనీ ఎండీ డాక్టర్ డేవిడ్ రీస్, నేషనల్ ఎగ్జిక్యూటివ్ సోమ్ చటోపాధ్యాయతో సమావేశమై ఈ మేరకు ఒప్పందం చేసుకున్నారు.

మనీశ్ సిసోడియాకు బెయిల్..
సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు

- మళ్లీ ట్రయల్ కోర్టుకు పంపడమంటే వైకుంఠపాళీ ఆడినట్లేనని సుప్రీం వ్యాఖ్య
- 17 నెలల తర్వాత బయటకు రానున్న ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం
- ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో అరెస్టు చేసిన సీబీఐ

ఢిల్లీ: ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేత మనీశ్ సిసోడియాకు ఎట్టకేలకు బెయిల్ లభించింది. లిక్కర్ పాలసీ కేసులో సుమారు 17 నెలల పాటు రిమాండ్ ఖైదీగా ఉన్న సిసోడియా జైలు నుంచి బయటకు అడుగుపెట్టనున్నారు. ఈ కేసులో ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ ను సుప్రీంకోర్టు శుక్రవారం విచారణకు చేపట్టింది. ఈ సందర్భంగా పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. కేసు విచారణను సాగదీయడం సరికాదని, వేగంగా విచారణ పూర్తిచేయాలని కోరే హక్కు సిసోడియాకు ఉందని పేర్కొంది. ట్రయల్ జరుగుతోందనే పేరుతో అనుమానితుడిని నిరవధికంగా జైలులో ఉంచుతామని అంటే ఒప్పుకోబోమని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ఈమేరకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్ ఈ కేసును విచారించారు. సిసోడియాను మళ్లీ ట్రయల్ కు పంపడమంటే అతడితో వైకుంఠపాళీ ఆడించినట్లేనని న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. ఇది ఆయన ప్రాథమిక హక్కులను కాలరాయడమేనని కూడా వ్యాఖ్యానించారు. బెయిల్ ఇవ్వకుండా సుదీర్ఘ కాలంపాటు జైలులో ఉంచడం ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకారయోగ్యం కాదన్నారు.బెయిల్ ఇవ్వకపోవడం అనుమానితుడిని శిక్షించడంగా భావించకూడదనే విషయాన్ని కింది కోర్టులు మరిచిపోయాయంటూ జస్టిస్ బీఆర్ గవాయి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాగా, ఈ కేసులో ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), సీబీఐ సాక్షులుగా పేర్కొన్న 493 మంది ఇచ్చిన స్టేట్ మెంట్ లలోనూ మనీశ్ సిసోడియా కేసు ట్రయల్ ను మరింత పొడిగించేందుకు ఎలాంటి అవకాశాలు తమకు కనిపించలేదని వ్యాఖ్యానించారు.ఆప్ నేత మనీశ్

మిగతా 2లో

నీట్ పిజి పరీక్షను వాయిదా వేసే ప్రసక్తి లేదు: సుప్రీంకోర్టు



2లో

కేజ్రీవాల్, కవితకు కూడా బెయిల్ లభిస్తుంది: కేటీఆర్

- కవితకు బెయిల్ కోరుతూ పిటిషన్ దాఖలు చేసినట్లు వెల్లడి
- జైల్లో ఉన్న కవిత 11 కిలోలు తగ్గారన్న కేటీఆర్
- ఛార్జిషీట్ దాఖలు చేశాక జైల్లో ఉంచాల్సిన అవసరం ఏమిటని ప్రశ్న

2లో

వరదల వల్ల నష్టపోయిన రైతాంగానికి
రూ.36 కోట్ల ఇన్ పుట్ సబ్సిడీ

- విత్తనాల కొరత లేకుండా చర్యలు చేపట్టాలన్న సీఎం చంద్రబాబు
- వంద శాతం ఈ క్రాపింగ్ నమోదు చేయాలి
- డ్రోన్ల వినియోగాన్ని పెంచాలి

అమరావతి: జులైలో వరదల వల్ల ప్రభావితమైన రైతులకు రూ.36 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని రాష్ట్ర విపత్తు నిధి నుంచి మంజూరు చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రాష్ట్రంలో విత్తనాల కొరత లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. రాష్ట్రంలో సాగవుతున్న ప్రాంతాన్ని వంద శాతం ఈ-క్రాపింగ్ కింద నమోదు చేయాలి ఆదేశించారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగాన్ని పెంచాలని చంద్రబాబు ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 140 డ్రోన్లను మాత్రమే వినియోగిస్తున్నట్టు అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. కరవు ప్రాంతాల్లో మాయిశ్చర్‌ను ఉపగ్రహ ఛాయా చిత్రాల ద్వారా పరిశీలన చేసి చర్యలు చేపట్టాలని సీఎం తెలిపారు. వచ్చే రెండేళ్లలో

మిగతా 2లో

ఇరాక్‌లో అమ్మాయిల పెళ్లి వయసు తొమ్మిదేళ్లే..

- పార్లమెంటులో వివాదాస్పద బిల్లు
- ఇప్పటి వరకు 18 ఏళ్లుగా ఉన్న వివాహ వయసు
- అమ్మాయిలకు 9, అబ్బాయిలకు 15 ఏళ్లు కుదించేలా ప్రతిపాదన
- ఆమోదం పొందితే బాల్య వివాహాలు పెరుగుతాయన్న ఆందోళన
- ఇప్పటి వరకు సాధించిన పురోగతి బూడిదలో పోసిన పన్నీరవుతుందంటూ విమర్శలు
- గతంలోనే ఇలాంటి ప్రయత్నమే చేసి వెనక్కి తగ్గిన ఇరాక్

ఇరాక్: సాధారణంగా ఏ దేశంలోనైనా అమ్మాయి పెళ్లి వయసు 18 ఏళ్లకు అటూ ఇటుగా ఉంటుంది. ఇరాక్‌లోనూ ఇప్పటి వరకు అలాగే ఉంది. అయితే, తాజాగా అక్కడి ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లు మాత్రం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అమ్మాయిల వివాహ వయసును 9 ఏళ్లకు కుదించాలని అందులో ప్రతిపాదించడమే దీనికి కారణం. పర్సనల్ స్టేట్ లాను సవరించే ఉద్దేశంతో ఇరాక్ న్యాయ మంత్రిత్వశాఖ ఈ బిల్లును ప్రవేశపెట్టింది. ఈ బిల్లు కానీ

మిగతా 2లో

అమ్మాయిలు బొట్టు పెట్టుకోవడాన్ని
నిషేధించగలరా?

- హిజాబ్ నిషేధంపై కాలేజీకి సుప్రీంకోర్టు ప్రశ్న
- హిజాబ్ ధరించడాన్ని నిషేధించిన ముంబయిలోని ఓ కాలేజీ
- హైకోర్టులో సవాల్ చేసిన విద్యార్థి సంఘాలు
- కాలేజీ నిర్ణయాన్ని సమర్థించిన హైకోర్టు
- సుప్రీంకోర్టుకు వెళ్లిన విద్యార్థి సంఘాలు

2

15న ఆ ప్రాజెక్ట్‌కు
ప్రారంభోత్సవం..

- జాతికి అంకితం చేయనున్న సీఎం రేవంత్
- ఉమ్మడి ఖమ్మం జిల్లా భూములు సస్యశ్యామలం
- ఈ ఏడాది బడ్జెట్‌లో మరో 1100 కోట్ల కేటాయింపు
- మంత్రి తుమ్మల కృషిపై హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

2లో

నిజామాబాద్ మున్సిపల్ ఆఫీసులో
అవినీతి తిమింగళం

2

పార్లమెంటు ఉభయ సభలు
నిరవధిక వాయిదా

- జులై 22న ప్రారంభమైన పార్లమెంటు వర్షాకాల సమావేశాలు
- ఈ సమావేశాల్లోనే బడ్జెట్ ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్
- మూడ్రోజులు ముందుగానే ముగిసిన పార్లమెంటు సమావేశాలు

న్యూఢిల్లీ: పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు నేటితో ముగిశాయి. ఈ సాయంత్రం పార్లమెంటు ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. జులై 22న ప్రారంభమైన ఈ సమావేశాలు ఆగస్టు 12 వరకు జరగాల్సి ఉన్నా:.. ముందుగానే ముగిశాయి. చివరగా వక్ఫ్ చట్టం సవరణ బిల్లు ప్రవేశపెట్టారు. ఈ సమావేశాల్లోనే కేంద్ర ఆర్థికమంత్రి

మిగతా 2లో

బంగ్లాదేశ్ నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా
ప్రవేశిస్తే చర్యలు తీసుకుంటాం : డీజీపీ

- అక్కడి పరిస్థితుల నేపథ్యంలో హైదరాబాద్‌లో నిఘా పెట్టామన్న డీజీపీ
- అక్రమంగా ఎవరైనా వస్తే చర్యలు ఉంటాయని స్పష్టీకరణ
- ఎలాంటి పరిణామాలనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం
- ప్రజల భద్రతకు అధిక ప్రాధాన్యత



2

సీఎం రేవంత్ అమెరికా టూర్‌లో పెట్టుబడుల వెల్లువ

ఆమ్‌జెన్ కొత్త రీసెర్చ్ సెంటర్ ను హైదరాబాద్ హైటెక్ సిటీలో ఆరు అంతస్తుల భవనంలో ఏర్పాటు చేయనున్నారు. దాదాపు 3 వేల మందికి ఇక్కడ ఉద్యోగాలు లభిస్తాయి. ఈ ఏడాది చివరి త్రైమాసికం నుంచే కంపెనీ తమ కార్యకలాపాలు ప్రారంభించనుంది. అంతకుముందు ఆమ్‌జెన్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రపంచంలో పేరొందిన బయోటెక్ సంస్థ హైదరాబాద్‌ను తమ కంపెనీ అభివృద్ధి కేంద్రంగా ఎంచుకోవటం గర్వించదగ్గ విషయమని అన్నారు. ఈ ఒప్పందం ద్వారా బయో టెక్నాలజీ రంగంలో హైదరాబాద్ ప్రాధాన్యం మరింత పెరుగుతుందన్నారు. ప్రపంచ స్థాయి సాంకేతికతతో రోగులకు సేవ చేయాలని కంపెనీ ఎంచుకున్న లక్ష్యం ఎంతో స్ఫూర్తిదాయకమైనదని సీఎం పేర్కొన్నారు.బయో టెక్నాలజీ రంగంలో గడిచిన 40 ఏళ్లుగా తాము అగ్రగామి సంస్థగా కొనసాగుతున్నామని ఆమ్‌జెన్ సంస్థ ఎండీ డాక్టర్ రీస్ అన్నారు. డేటా సైన్స్, అర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ కలయికతో కొత్త ఆవిష్కరణలతో మరిన్ని సేవలు అందించాలనే హైదరాబాద్ లో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయబోతున్నామని, బయోటెక్ రంగంలో ఇదొక అద్భుతమైన మైలురాయిగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.ఆమ్‌జెన్ ఇండియా తన కొత్త రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు హైదరాబాద్ ను కేంద్రంగా ఎంచుకోవటం ఆనందంగా ఉందని, దీని ద్వారా ప్రపంచ స్థాయిలో లైఫ్ సైన్సెస్ రంగానికి పూర్తి అనువైన ప్రాంతం హైదరాబాదే అని మరోసారి రుజువైందని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. కంపెనీ విస్తరణకు ప్రభుత్వం సహకరిస్తుందని మంత్రి భరోసా ఇచ్చారు. ఆమ్ జెన్ కంపెనీ ప్రపంచవ్యాప్తంగా వంద దేశాల్లో విస్తరించి ఉంది. దాదాపు 27 వేల మంది ఉద్యోగులున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనలో బిజీబిజీగా గడుపుతున్నారు. పలు కంపెనీల ప్రతినిధులతో చర్చలు జరిపి.. రాష్ట్రానికి వచ్చి పెట్టుబడులు పెట్టాలన్నారు. రాష్ట్రానికి వస్తే తగిన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పి రాయితీలు ఇస్తున్నారు. సీఎంతో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులు అమెరికా పర్యటనలో ఉన్నారు. ఈ సందర్భంగా.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రఖ్యాత అడోబ్ సిస్టమ్స్ సీఈవో శంతను నారాయణ్‌తో భేటీ అయ్యారు.ఫ్యూచర్ స్టేట్ తెలంగాణకు పెట్టుబడులు లక్ష్యంగా అమెరికాలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి.. ప్రస్తుతం కాలిఫోర్నియాలోని పలువురు గ్లోబల్ బిజినెస్ లీడర్లతో సమావేశాలు, చర్చలు జరుపుతున్నారు. అడోబ్ సీఈవోతో సమావేశంలో సీఎంతో పాటు పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఇతర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని అలవర్చుకోవాలి..

ఆలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం.. ఆలయ నిర్మాణంలో నా వంతు సహాయంగా స్లాబ్ వేయించడం నా పూర్వ జన్మ సుకృతం - నీలం మధు ముదిరాజ్

సంగారెడ్డి ఆగస్టు,09(డైలీ రిపోర్ట్)పెరుగుతున్న పోటీ ప్రపంచంలో ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా ఉండడానికి ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని అలవర్చుకోవాలని మెదక్ పార్లమెంట్ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు.శుక్రవారం పటాన్చెరువు మండలం ముత్తంగి గ్రామపంచాయతీ పరిధిలోని న్యూటన్ కాలనీలో శివ పంచాయతన నాగేంద్ర స్వామి ఆలయ ప్రారంభోత్సవానికి ఆయన హాజరయ్యారు.ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ ఆలయాల నిర్మాణాలతో గ్రామాలలో ఆధ్యాత్మిక సౌరభం వెల్లివిరుస్తుందన్నారు. ఆలయాల నిర్మాణానికి తన వంతు సంపూర్ణ సహకారం అందిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు దత్తు పంతులు, గడిల శ్రీధర్ గౌడ్, సిహెచ్ సంజీవ, వెంకట్ రెడ్డి, అరవింద్ గౌడ్,అర్జున్,రమేష్,సురేష్, ప్రవీణ్ గౌడ్, భక్తులు,తదితరులు పాల్గొన్నారు.

వరదల వల్ల నష్టపోయిన రైతాంగానికి రూ.36 కోట్ల ఇన్ పుట్ సబ్సిడీ

రాష్ట్రంలో ఉద్యాన పంటల ఉత్పత్తి పెరిగేలా చర్యలు చేపట్టాలని అన్నారు. మైక్రో ఇరిగేషన్ మాన్యుఫ్యాక్చరింగ్ పార్క్ ఏర్పాటుపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.త్వరలోనే ప్రారంభించనున్న అన్నదాత సుఖీభవ కార్యక్రమానికి లబ్ధిదారులను గుర్తించేందుకు మొబైల్ నంబర్లు, బ్యాంకు ఖాతాలను అనుసంధానం చేసేలా జియో ట్యాగ్ చేయాలని చంద్రబాబు సూచించారు. నిమ్మ, టమాటా, మామిడి వంటి ఉత్పత్తుల విలువ జోడించే విధంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ప్రోత్సహించాలన్నారు. ఈ ఉత్పత్తుల ఎగుమతులకు ఎయిర్ కార్గో సేవలను అందించేలా చూడాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.మైదాన ప్రాంతాల్లో ఉన్న ఆదివాసీల జీవన ప్రమాణాలు, పరిస్థితులు ఇప్పటికీ దుర్భరంగానే ఉన్నాయని, గత ప్రభుత్వం ఆదివాసీలను పట్టించుకోలేదని విమర్శించారు సీఎం చంద్రబాబు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన ప్రపంచ ఆదివాసీల దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత ఆయనకు ఆదివాసీలు సంప్రదాయ నృత్యాలు, డప్పు వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆదివాసీల డప్పును మోగించారు. వారితో కలిసి నృత్యం చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లలో గిరిజన ఉత్పత్తులను పరిశీలించారు.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఆదివాసీలు తమ కష్టాలను, సమస్యలను చెప్పే అవకాశం లేకుండా చేశారని, గడిచిన ఐదేళ్లలో ఆదివాసీలను పట్టించుకోలేదన్నారు. ఆదివాసీల కోసమే అరకు కాఫీని పెద్ద ఎత్తున ప్రమోట్ చేశామని, ప్రధాని మోదీనే దానికి బ్రాండ్ అంబాసిడర్ గా నిలిచారన్నారు. పారిస్ లో కూడా మన అరకు కాఫీ అమ్ముడవుతుందని గర్వంగా చెప్పారు సీఎం. గిరిజనులు ఆర్గానిక్ ఉత్పత్తులను పండిస్తారని, మెడిసినల్ వాల్యూ ఉండే ఉత్పత్తులన్నీ అడవుల్లోనే దొరుకుతాయని తెలిపారు. మనకు నాణ్యమైన తేనె కూడా అడవుల్లోనే దొరుకుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 6 లక్షల ఆదివాసీ కుటుంబాలు ఉన్నాయని, మారుమూల ప్రాంతాల్లో ఉన్న గిరిజనులకు న్యాయం చేయడమే తమ లక్ష్యమన్నారు. గిరిజనులు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆదర్శంగా తీసుకుని ఎదగాలని సూచించారు. దేశంలో తలసరి ఆదాయం లక్షా 72 వేలు ఉండగా.. ఆంధ్రప్రదేశ్ లో తలసరి ఆదాయం 2 లక్షల 20 వేలు ఉందని, తెలంగాణలో తలసరి ఆదాయం 3 లక్షల 20 వేల రూపాయలు ఉందన్నారు. అక్కడ గతంలో తాము చేసిన అభివృద్ధితో ఇప్పుడు తలసరి ఆదాయం పెరిగిందని చెప్పుకొచ్చారు చంద్రబాబు. ఏపీలోని గిరిజన ప్రాంతాల్లో మాత్రం ఆదివాసీల తలసరి ఆదాయం లక్షా 25 వేల రూపాయలుగానే ఉందని.. ఇతరుల కంటే వీరి ఆదాయం లక్ష తక్కువగా ఉందని, ఇది సమంజసం కాదన్నారు. గిరిజనుల తలసరి ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఇంకా డోలీలు కనిపించడం దురదృష్టకరమని, ఆదివాసీలను పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చి ఆదుకునేంత వరకూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు.2014-19 టీడీపీ హయాంలో ఆదివాసీల కోసం 16 పథకాలు, సుమారు 199 గురుకుల పాఠశాలలు, 2,705 విద్యాసంస్థలను ఏర్పాటు చేసి 2 లక్షల పై మందికి పైగా విద్యార్థులకు విద్యను అందించామని గుర్తు చేశారు.

నీట్ పిజి పరీక్షను వాయిదా వేసే ప్రసక్తి లేదు: సుప్రీంకోర్టు

ఢిల్లీ: ఆగస్టు 11న జరగవలసి ఉన్న నీట్ పిజి పరీక్షను వాయిదా వేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసింది. నీట్ పిజి పరీక్ష కోసం అభ్యర్థులకు కేటాయించిన నగరాలు చాలా దూరంలో ఉండడం వల్ల చేరుకోవడానికి ఇబ్బంది ఉందంటూ పిటిషనర్ చేసిన వాదనను కోర్టు తోసిపుచ్చింది. ఐదుగురు అభ్యర్థుల కోసం రెండు లక్షల మంది అభ్యర్థుల జీవితాలను తాము సంక్షోభంలోకి నెట్టలేమని చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ జెబి పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. అటువంటి పరీక్షను ఎలా వాయిదా వేయగలమని, ఇటీవలి కాలంలో పరీక్ష వాయిదా వేయాలని కోరుతూ ప్రజలు సర్వసాధారణ విషయంలా సుప్రీంకోర్టుకు వచ్చేస్తున్నారని పిటిషనర్ల తరఫు న్యాయవాది సంజయ్ హెగ్డేను ఉద్దేశించి ధర్మాసనం పేర్కొంది. తాము పరీక్షను రద్దు చేస్తే రెండు లక్షల మంది విద్యార్థులు, నాలుగు లక్షల మంది వారి తల్లిదండ్రులు రోదిస్తారని, ఇన్ని లక్షల మంది విద్యార్థుల జీవితాలను తాము ఇబ్బందుల పాలుచేయలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ పిరటిషన్ల వెనుక ఉన్నదెవరో తమకు తెలియదని ధర్మాసనం పేర్కొంది.

పార్లమెంటు ఉభయ సభలు నిరవధిక వాయిదా

నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఎన్డీయే 3.0 ప్రభుత్వం ఏర్పడ్డాక ఇది పూర్తి స్థాయి బడ్జెట్. ఈసారి పార్లమెంటు సమావేశాల్లో నీట్ యూజీ పేపర్ లీకేజి అంశం తీవ్ర రగడకు దారితీసింది. రైల్వే భద్రత అంశం కూడా ఉభయ సభల్లో చర్చకు వచ్చింది.వక్ఫ్ బిల్లును ఆగస్టు 8న లోక్‌సభలో రిజిజు ప్రవేశపెట్టారు , తీవ్ర చర్చ తర్వాత జాయింట్ పార్లమెంటరీ ప్యానెల్‌కు దానిని పంపారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు వక్ఫ్ (సవరణ) బిల్లు 2024ను పరిశీలించడానికి జాయింట్ పార్లమెంటరీ కమిటీ (JPC)కి 21 మంది లోక్‌సభ ఎంపీల పేర్లను ప్రతిపాదించారు. అలాగే 10 మంది సభ్యుల పేర్లను సిఫారసు చేయాలని రాజ్యసభను కోరారు. ఈ ప్రతిపాదనను సభ ఆమోదించింది.

జెపిసిలో చేర్చబడిన 21 మంది ఎంపీల జాబితా:

దిగువ సభకు చెందిన 21 మంది ఎంపీలు జెపిసి సభ్యులుగా ఉంటారు. వారు: జగదాంబిక పాల్, నిషికాంత్ దూబే, తేజస్వి సూర్య, అపరాజిత సారంగి, సంజయ్ జైస్వాల్, దిలీప్ సైకియా, అభిజిత్ గంగోపాధ్యాయ, డికె.అరుణ, గౌరవ్ గొగోయ్, ఇమ్రాన్ మసూద్, మహ్మద్ జావూద్ , మౌలానా మొహిబుల్లా నద్వీ, కళ్యాణ్ బెనర్జీ, ఎ.రాజా, లావు శ్రీ కృష్ణ దేవరాయలు, దిలేశ్వర్ కమైత్, అరవింద్ సావంత్, సురేశ్ గోపీనాథ్, నరేశ్ గణపత్ మ్హాస్కే, అరుణ్ భారతి , అసదుద్దీన్ ఒవైసీ.

ఇది క్రూరమైన చట్టమని, రాజ్యాంగంపై ప్రాథమిక దాడి అని కాంగ్రెస్ ఎంపీ కెసి. వేణుగోపాల్ అన్నారు. ఈ బిల్లు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15, 25 సూత్రాలను ఉల్లంఘిస్తోందని ఏఐఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. ఈ బిల్లు వివక్షాపూరితమైనది , ఏకపక్షంగా ఉందని, దీనిని తీసుకురావడం ద్వారా కేంద్ర ప్రభుత్వం దేశాన్ని ఏకం చేయకుండా విభజించే పనిని చేస్తోందని ఒవైసీ అభిప్రాయపడ్డారు. 'మీరు ముస్లింలకు శత్రువే అనడానికి ఈ బిల్లు నిదర్శనం' అని ఆయన అన్నారు. ఈ కమిటీ తన నివేదికను వచ్చే సెషన్‌లో మొదటి వారం చివరి కల్లా లోక్‌సభకు సమర్పించనుంది.

కేజ్రీవాల్, కవితకు కూడా బెయిల్ లభిస్తుంది: కేటీఆర్

హైదరాబాద్: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్, కవితకు కూడా బెయిల్ లభిస్తుందని భావిస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కవితకు బెయిల్ కోరుతూ పిటిషన్ దాఖలు చేశామన్నారు. త్వరలో తన సోదరికి బెయిల్ లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జైల్లో ఉన్న కవిత 11 కిలోలు బరువు తగ్గినట్లు చెప్పారు. ఢిల్లీ మద్యం కేసులో ఛార్జిషీట్ దాఖలు చేశాక ఇంకా జైల్లో ఉంచాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ఈ కేసులో మనీశ్ సిసోడియాకు ఇప్పటికే బెయిల్ లభించినట్లు చెప్పారు. సుంకిశాల ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం అసత్య ప్రచారం చేస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. ఆ ప్రాజెక్టుకు పునరుజ్జీవం తెచ్చిందే కేసీఆర్ ప్రభుత్వమన్నారు. హైదరాబాద్ నీటి అవసరాల కోసం సుంకిశాల ప్రాజెక్టును మొదలుపెట్టారని, అయితే దానిని నల్గొండ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తుచేశారు. నాగార్జునసాగర్‌లో డెడ్ స్టోరేజీ ఉన్నా హైదరాబాద్‌కు నీటికష్టాలు రాకూడదనే ఈ ప్రాజెక్టు చేపట్టామన్నారు. హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాలకు సాగు, తాగునీటి కోసం సుంకిశాల ఉపయోగపడుతుందన్నారు.

కృష్ణానదికి నాలుగేళ్లు నీళ్లు రాకపోయినా ఈ ప్రాజెక్టు కారణంగా ఇబ్బందులు ఉండవన్నారు. అదే ఢిల్లీ, బెంగళూరు, చెన్నైలో నీటికోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో నీటికోసం ఇబ్బందులు పడే పరిస్థితి లేదన్నారు. హైదరాబాద్‌కు 50 ఏళ్లు తాగునీటి అవసరాలకు సరిపడేలా తమ హయాంలో ప్రణాళికలు రూపొందించామన్నారు. సుంకిశాల ఘటనను ప్రభుత్వం ఎందుకు తొక్కిపెట్టిందో చెప్పాలన్నారు. ఆగస్ట్ 2న ఉదయం 6 గంటలకు సుంకిశాల ప్రమాదం జరిగితే ప్రభుత్వానికి సమాచారం లేదా? లేక విషయాన్ని దాచిపెట్టారా? అని ప్రశ్నించారు. ఒకవేళ ఈ విషయం ప్రభుత్వానికి తెలియకపోతే అది సిగ్గుచేటన్నారు. త్వరత్వరగా పనులు చేయాలని హడావిడిగా గేట్లు పెట్టడంతో ప్రమాదం జరిగిందన్నారు. ప్రభుత్వ నిర్వహణ లోపంతో గోడ కూలిందన్నారు. పనులు చేస్తున్న ఏజెన్సీని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. సుంకిశాల ఘటనపై న్యాయ విచారణకు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సుంకిశాలను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు.

మున్సిపల్ శాఖను తనవద్ద పెట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఘటనకు బాధ్యత వహించాలన్నారు. మేడిగడ్డలో ఏమైనా జరిగితే కేంద్రం స్పందిస్తుందని, ఇప్పుడు బీజేపీ ఏం చెబుతుందని కేటీఆర్ నిలదీశారు. మేడిగడ్డ ఘటన ఎన్నికల సమయంలో జరిగినప్పటికీ దానిని దాచిపెట్టలేదన్నారు.

రిటైర్డ్ ఇంజినీర్లతో కలిసి సుంకిశాలను త్వరలో బీఆర్ఎస్ బృందం సందర్శిస్తుందన్నారు. కాంగ్రెస్ నేతల చిల్లర ప్రచారానికి ప్రకృతే సమాధానం చెబుతుందని వ్యాఖ్యానించారు.

అమ్మాయిలు బొట్టు పెట్టుకోవడాన్ని నిషేధించగలరా?

మహారాష్ట్ర: మహారాష్ట్ర రాజధాని ముంబయిలోని ఓ కాలేజీ అమ్మాయిలు హిజాబ్‌ను ధరించడంపై నిషేధించడంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కాలేజీ ఇచ్చిన సర్క్యులర్‌పై నవంబర్ 18 వరకు సుప్రీంకోర్టు స్టే విధించింది. అమ్మాయిలు బొట్టుబిళ్లలు పెట్టుకోవడం, లేదా తిలకం దిద్దుకోవడాన్ని కూడా ఇలాగే నిషేధిస్తారా? అని సుప్రీంకోర్టు బెంచ్ ప్రశ్నించింది. విద్యార్థినులకు వారు ధరించే దుస్తులపై స్వేచ్ఛ ఉండాలని, కాలేజీలు వారిని వేషధారణపై బలవంతం చేయకూడదని పేర్కొంది. భారత్‌లో అనేక మతాలు ఉన్నాయని తెలిసి ఇలా చేయడం దురదృష్టకరమని పేర్కొంది.అయితే ముస్లిం విద్యార్థినులను హిజాబ్ ధరించడానికి అనుమతిస్తే హిందూ విద్యార్థులు కాషాయ కండువాలు ధరించే అవకాశాలు ఉన్నాయని కాలేజీ సుప్రీంకోర్టు బెంచ్ దృష్టికి తీసుకువెళ్లింది. దీనిని రాజకీయం చేసే అవకాశాలు ఉన్నాయని తెలిపింది. హిజాబ్‌పై మధ్యంతర ఉత్తర్వులను దుర్వినియోగం చేయవద్దని, అలా జరిగితే కోర్టును ఆశ్రయించవచ్చునని ఆ కాలేజీకి అత్యున్నత న్యాయస్థానం సూచించింది. అలాగే, తరగతి గదుల్లో బురాలు ధరించవద్దని, క్యాంపస్‌లో మతపరమైన కార్యకలాపాలకు అనుమతి లేదని సుప్రీంకోర్టు వెల్లడించింది.

క్యాంపస్‌లో హిజాబ్ వంటివి ధరించకూడదంటూ కాలేజీ జారీ చేసిన సర్క్యులర్‌ను కొన్ని విద్యార్థి సంఘాలు బాంబే హైకోర్టును ఆశ్రయించాయి. కాలేజీ నిర్ణయాన్ని హైకోర్టు స్వాగతించింది. దీంతో విద్యార్థి సంఘాలు సుప్రీంకోర్టులో సవాల్ చేశాయి. కాలేజీ విధించిన షరతులపై జస్టిస్ సంజీవ్ ఖన్నా, సంజయ్ కుమార్ ధర్మాసనం విచారణ జరిపింది. ఈ విషయమై నవంబర్ 18వ తేదీలోగా స్పందనను తెలియజేయాలని ముంబయి ఎడ్యుకేషన్ సొసైటీని సుప్రీంకోర్టు కోరింది. ఈ మేరకు కళాశాలకు నోటీసులు జారీ చేసింది. కేసు విచారణను వాయిదా వేసింది.క్యాంపస్‌లో హిజాబ్, బురఖా, క్యాప్, నఖాబ్‌లను నిషేధిస్తూ ముంబైలోని ఒక కళాశాల జారీచేసిన సర్క్యులర్‌పై సుప్రీంకోర్టు శుక్రవారం పాక్షికంగా స్టే విధించింది. తాము ఏమి ధరించాలో ఎంచుకునే స్వేచ్ఛ విద్యార్థినులకు ఉండాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. విద్యార్థినుల వస్త్రధారణపై ఆంక్షలు విధించే అధికారం విద్యా సంస్థలకు లేదని సుప్రీంకోర్టు తెలిపింది. ఎన్‌జి ఆచార్య, డికె మరాఠే కాలేజ్‌లను నిర్వహిస్తున్న చెంబూర్ ట్రాంబే ఎడ్యుకేషన్ సొసైటీకి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌తో కూడిన ధర్మాసనం నోటీసులు జారీచేసింది. తాము ధరించే వస్త్రధారణ ఎంపికపై విద్యార్థినులకు స్వేచ్ఛ ఉండాలని, వారిపై ఒత్తిడి తీసుకురాకూడదని ధర్మాసనం పేర్కొంది. దేశంలో చాలా మతాలు ఉన్నాయన్న విషయం మీకు హఠాత్తుగా గుర్తుకు వచ్చినట్లుందని కళాశాల యాజమాన్యంపై కోర్టు వ్యాఖ్యానించింది. విద్యార్థినుల మత విశ్వాసాలు వెల్లడి కాకూడదన్నదే కళాశాల ఉద్దేశమైతే తిలకం, బొట్టును ఎందుకు నిషేధించలేదని ధర్మాసనం ప్రశ్నించింది.

మనీశ్ సిసోడియాకు బెయిల్.. సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు

సిసోడియాకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఢిల్లీ మద్యం కేసులో సిసోడియాకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. షరుతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. సిసోడియా పాస్ పోర్టును సరెండర్ చేయడంతో పాటు దేశం విడిచి వెళ్లొద్దని కోర్టు తెలిపింది. సిసోడియాకు వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లేవని సుప్రీంకోర్టు తీర్పు వెల్లడించింది. ఏ నిందితుడిని కాలపరిమితి లేకుండా జైలులో ఉంచలేరని ధర్మాసనం పేర్కొంది. విచారణలో పురోగతి లేకపోతే పరిమితి దాటక జైలులో ఉంచలేరని, జైలులో ఉంచాలనుకుంటే ఆ వ్యక్తి హక్కులు హరించడమేనని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది.

బెయిల్ అప్లికేషన్ పెట్టడం, బెయిల్ పొందడం వారి హక్కు అని స్పష్టం చేసింది. సిసోడియాకు బెయిల్ ఇవ్వొద్దన్న దర్యాప్తు సంస్థల వాదనలను తోసిపుచ్చింది. ట్రయల్ వేగంగా జరిగేందుకు సిసోడియా సహకరించాలని సుప్రీ ఆదేశాలు జారీ చేసింది. సిసోడియా జైలు నుంచి బయటకు రావడంతో ఆప్ నేతలు సంబరాలు చేసుకుంటున్నారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో 2023 ఫిబ్రవరి 26న సిసోడియాను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆయన బాస్ అరవింద్ కేజ్రీవాల్, ఎంఎల్ సి కవితను కూడా మనీలాండరింగ్ కేసులో అరెస్టు చేశారు. వీళ్లతో పాటు మరో 12 మందిని లిక్కర్ స్కామ్ కేసులో అరెస్టు చేసిన విషయం విధితమే.

ఇరాక్‌లో అమ్మాయిల పెళ్లి వయసు తొమ్మిదేళ్లే..

పార్లమెంటులో ఆమోదం పొందితే బాల్య వివాహాలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. అమ్మాయిలకు 9 ఏళ్లు, అబ్బాయిలకు 15 ఏళ్లు వస్తే వివాహాలకు సిద్ధమైపోతారు. ఈ విషయంలో వారికి చట్టపరంగా ఎలాంటి అడ్డంకి ఉండదు. లింగ సమానత్వంతోపాటు మహిళా హక్కుల విషయంలో ఇప్పటి వరకు సాధించిన పురోగతిని ఈ బిల్లు నట్టేట్లో కలిపేస్తుందని నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మానవహక్కుల సంఘాలు, మహిళా సంఘాలు సైతం ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. బాలికల విద్యను ఇది అడ్డుకుంటుందని, వారి ఆరోగ్యంపైనా ప్రభావం చూపిస్తుందని చెప్తున్నారు. చిన్న వయసులోనే గర్భం దాల్చడం, గృహ హింస పెచ్చుమీరుతాయని, చదువు ఆగిపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరాక్ గతంలోనూ ఇలాంటి ప్రయత్నమే చేసినప్పటికీ అప్పట్లో చట్ట సభ్యుల వ్యతిరేకతతో వెనక్కి తగ్గింది. అయితే, ఇప్పుడేమవుతుందోనన్న ఉత్కంఠ మాత్రం నెలకొంది.

నిజామాబాద్ మున్సిపల్ ఆఫీసులో అవినీతి తిమింగళం

నిజామాబాద్: తెలంగాణ రాష్ట్రం మొత్తం షాక్ అయ్యింది. ఓ మున్సిపల్ ఆఫీసులో పనిచేసే సూపరింటెండ్ ఇంట్లో నోట్ల కట్టలు గుట్టలు గుట్టలుగా బయటపడటం సంచలనంగా మారింది. ఏకంగా 7 కోట్ల రూపాయల వరకు అవినీతి సొమ్ము బయటపడటం చర్చనీయాంశమైంది.పూర్తి వివరాల్లోకి వెళితే.. నిజామాబాద్ మున్సిపల్ ఆఫీసులో సూపరింటెండెంట్ గా పని చేస్తున్నారు దాసరి నరేందర్. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు సమాచారం రావటంతో.. ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. 2024, ఆగస్ట్ 9వ తేదీ రోజంతా సోదాలు చేయగా.. ఏసీబీ అధికారులే షాకయ్యే ఆస్తులు బయటపడ్డాయి.దాసరి నరేందర్ ఇంట్లో.. అతని బంధువుల ఇళ్లల్లో ఏకంగా 2 కోట్ల 93 లక్షల 81 వేల రూపాయల డబ్బు బయటపడింది. డబ్బును కట్టలు కట్టి.. గుట్టలుగా పెట్టాడు నరేందర్. ఈ నోట్ల కట్టలు చూసి షాక్ అయ్యారు ఏసీబీ అధికారులు. అంతేనా.. దాసరి నరేందర్ బ్యాంక్ ఖాతాలో.. అక్షరాల కోటి 10లక్షల రూపాయలున్నాయి. ఇంట్లోనే బీరువాల్లో అర కిలో బంగారం, స్థిరాస్తులకు సంబంధించి 17 డాక్యుమెంట్లు బయట పడ్డాయి. ఇప్పటి వరకు జరిగిన సోదాల్లో.. దాసరి నరేందర్ దగ్గర దొరికిన మొత్తం ఆస్తులు అక్షరాల 7 కోట్ల రూపాయల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు గుర్తించామని.. కేసు నమోదు చేశామని.. విచారణ కొనసాగుతుందని ఏసీబీ అధికారులు వెల్లడించారు. ఓ మున్సిపల్ ఆఫీసులో సూపరింటెండెంట్‌గా పనిచేసే ఓ ఉద్యోగి దగ్గర కోట్ల రూపాయలు.. అది కూడా నోట్ల కట్టలు దొరకటం.. ఆ ఫొటోలు వైరల్ కావటం విశేషం.

మండల యూత్ కాంగ్రెస్ ఎన్నికల బరిలో కొనింటి శశికాంత్

10 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి సేవ చేస్తున్న ఆశీర్వదించి గెలిపించండి



శంకర్‌పల్లి: ఆగస్టు 09:(డైలీ రిపోర్ట్): కాంగ్రెస్ పార్టీ మండల యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో శంకర్‌పల్లి మండల మహాలింగాపురం గ్రామానికి చెందిన కొనింటి శశికాంత్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షునిగా పోటీ చేస్తున్నట్లుగా శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శంకర్‌పల్లి మండలం యూత్ కాంగ్రెస్ అధ్యక్షునిగా ఆశీర్వదించి గెలిపిస్తే అందరికీ అందుబాటులో ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఎన్నికలు ఆగస్టు10 నుండి సెప్టెంబర్ 10 వరకు ఆన్ లైన్ పద్ధతిలో జరుగుతాయన్నారు. పార్టీ నియమ నిబంధనలకు కట్టుబడి అంకిత భావంతో పనిచేసే వారిని కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు ఆదరించి గెలిపించాలన్నారు. ఆన్ లైన్ ప్రక్రియ ద్వారా ఎన్నుకోబడే ఈ అధ్యక్ష పోటీల్లో కార్యకర్తలు అందరూ తనకు మద్దతుగా యువకులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ప్రోత్సహించాలని, పది సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి సేవ చేస్తున్నానని, ఆన్ లైన్ ద్వారా తనకు ఓటు వేయించి అత్యధిక మెజార్టీతో వచ్చేలా చూడాలని కోరారు.

15న ఆ ప్రాజెక్ట్‌కు ప్రారంభోత్సవం..

ఖమ్మం : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపాదించిన సీతారామ ప్రాజెక్టు ఎట్టకేలకు ప్రారంభానికి సిద్ధం కావడంతో రైతుల్లో ఆనందం నెలకొంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది లక్షల ఎకరాలకు గోదావరి జలాలు అందించే ఈ ప్రాజెక్టును సీఎం రేవంత్ రెడ్డి ఈ నెల 15న జాతికి అంకితం చేయనున్నారు. సుమారు 20ఏళ్లుగా మంత్రి తుమ్మ

శంకర్‌పల్లిలో భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి

శంకర్‌పల్లి: ఆగస్టు 09:(డైలీ రిపోర్ట్): నాగుల పంచమిని పురస్కరించుకోని శంకర్‌పల్లి మండలంలోని దేవాలయాలు శుక్రవారం మహిళలతో కిక్కిరిసిపోయాయి. తెల్లవారుజాము నుంచే మున్సిపల్ పరిధిలోని అయ్యప్ప, శివాలయం, సాయిబాబా, పోచమ్మ దేవాలయల ఆవరణలో ఉన్న పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ముఖ్యంగా హనుమాన్ దేవాలయంలోని శివాలయం భక్తులతో కిటకిటలాడింది. మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్,బుల్కాపూర్ రేణుక ఎల్లమ్మ ఆలయంలో, మరియు రెండవ వార్డు కౌన్సిలర్ బీసోళ్ళ సంధ్యారాణి అశోక్ కుమార్ గణేష్ నగర్ లోని పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

మైనర్లు వాహనం నడిపితే వారి ప్రాణాలకి ప్రమాదం: చేవెళ్ల ట్రాఫిక్ సిఐ వెంకటేశం

శంకర్‌పల్లి: ఆగస్టు 09:(డైలీ రిపోర్ట్): మైనర్లు వాహనాలు నడపరాదని చేవెళ్ల ట్రాఫిక్ సిఐ వెంకటేశం అన్నారు. శుక్రవారం శంకర్‌పల్లి మున్సిపల్ పరిధి ఫతేపూర్ బ్రిడ్జి దగ్గర మైనర్లకు, డ్రైవర్లకు, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండని మైనర్లు నడపరాదని, 18 సంవత్సరాలు నిండకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. డ్రైవర్లు అందరూ కచ్చితంగా యూనిఫామ్ ధరించాలన్నారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు. సెల్ ఫోన్లు మాట్లాడుతూ రోడ్లు దాటొద్దని తెలిపారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడపరాదన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, లేనియెడల కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ అశోక్ పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక భాధ్యత: రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమ సింగ్

శంకర్‌పల్లి: ఆగస్టు 09:(డైలీ రిపోర్ట్): మొక్కలను నాటి సంరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమసింగ్ అన్నారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శంకర్‌పల్లి మున్సిపల్ పరిధి బుల్కాపూర్ 4, 5 వార్డులలో వనమహోత్సవం కార్యక్రమం జరిగింది. అడిషనల్ కలెక్టర్ ప్రతిమ సింగ్, మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్ తో కలిసి మొక్కలను నాటి నీరు పోశారు. అనంతరం పట్టణ పరిధిలోని డంపింగ్ యార్డును అడిషనల్ కలెక్టర్ సందర్శించారు. అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షణ చేపట్టితే పచ్చదనంతో పాటు ఆక్సిజన్ లభ్యమవుతుందన్నారు. వర్షాకాలంలో ప్రభావితమయ్యే వైరల్ ఫీవర్ మరియు ఇత%ఎ%ర వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ వెంకట్ రామ్ రెడ్డి, కౌన్సిలర్లు, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు ఫ్రైడే డ్రైడే కార్యక్రమం

శంకర్‌పల్లి: ఆగస్టు 09:(డైలీ రిపోర్ట్): సీజనల్ వ్యాధులు నివారించేందుకు ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించినట్టు శంకర్‌పల్లి చైర్ పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్, కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. పట్టణ పరిధి 15వ వార్డులో శుక్రవారం సీజనల్ వ్యాధులు, దోమలను నివారించేందుకు ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ తమ ఇంటి శుభ్రతతో పాటు, చుట్టూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వెంకట్ రామ్ రెడ్డి, మేనేజర్ అంజన్ కుమార్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్, శానిటరీ ఇన్స్పెక్టర్, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లా,జిన్నారం మండల కేంద్రంలో ఘనంగా 64వ యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

సంగారెడ్డి ఆగస్టు 09(డైలీ రిపోర్ట్) : భారతదేశ ఉక్కు మహిళ శ్రీమతి ఇందిరా గాంధీ 09/08/1960 లో కాంగ్రెస్ పార్టీకి అనుబంధ సంస్థగా భారత దేశ జాతీయ యువజన కాంగ్రెస్ ను ఏర్పాటు చేసి నేటికి 64 సంవత్సరాలు పూర్తి అయింది. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని నేడు జిన్నారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు యనగండ్ల నరేందర్ అధ్యక్షతన యువజన కాంగ్రెస్ పతాకాన్ని ఆవిష్కరించడం జరిగింది. అనంతరం యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల కలిసి మొక్కలను నాటడం జరిగింది. అనంతరం స్వీట్లు పంచుకొని శుభాకాంక్షలు తెలియజేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మరియు యువజన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.

తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ పెద్దకంజర్ల సందు అవగాహనా సదస్సు

సంగారెడ్డి ఆగస్టు 09(డైలీ రిపోర్ట్) : జాతీయ న్యాయ సేవాధికార సంస్థ మరియు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవానిచంద్ర ఆదేశాల ప్రకారం ఈ రోజు స్థానిక తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ పెద్దకంజర్ల సందు అవగాహనా సదస్సు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీ బి. రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం నాడు గిరిజన దినోత్సవం సందర్భంగా ట్రైబల్ డిగ్రీ కాలేజీలో సందర్శించడం జరిగింది మరియు న్యాయ అవగాహనా సదస్సు నిర్వహించడం జరిగింది. న్యాయ అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీ బి. రమేష్ మాట్లాడుతూ తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ పెద్దకంజర్ల సందు గిరిజన దినోత్సవం సందర్భంగా అవగాహనా సదస్సు నిర్వహించడం జరిగింది. పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు అదేవిదంగా వారి యొక్క బాగోగులను కూడా చూడాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి అని హెచ్చరించారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించండి అన్నారు. గృహ హింస, బాల్య వివాహ నిషేధ చట్టం, పోస్కో చట్టం, వరకట్న నిషేధ చట్టాలపై అవగహన కలిగి ఉండాలి అన్నారు. మంచి చదువులు చదివి ఉన్నత ఎదుగుదల ఎదగాలని అన్నారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులు న్యాయ పరమైన విషయాలలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని ఏదైనా న్యాయ సహాయం కోరినచో న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయం, సంగారెడ్డిని సంప్రదించగలరు. ఈ సదస్సు నందు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీ బి. రమేష్ , తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ కాలేజీ ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

దళిత గిరిజనులపై వివక్ష దాడులు అరికట్టాలి, వారికి రక్షణ కల్పించాలి

రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తో కెవిపిఎస్ నేతలు..

సంగారెడ్డి ఆగస్టు09 (డైలీ రిపోర్ట్)తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య గారు సంగారెడ్డికి వచ్చిన సందర్భంగా కెవిపిఎస్ నాయకుల బృందం వారితో కలిసి దళిత గిరిజనుల సమస్యలపై చర్చించడం జరిగింది ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్ మాట్లాడుతూ నేటికీ దళితుల గిరిజనుల పైన దాడులు వివక్ష పెద్ద ఎత్తున జరుగుతున్నాయని అన్నారు కోహీర్ మండలం బడంపేటలో దళితుడు బేగరి నర్సింలు ను అత్యంత కిరాతకంగా కొట్టి చంపినారు ఈ ఘటనలో పెత్తందారులైన అసలు నిందితుల్ని పోలీసులు వదిలేసినారు ఎస్సీ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కేసులు నమోదు చేస్తున్న స్టేషన్ బెయిల్ ఇవ్వడంతో ఘటనలు తిరిగి పునరావృతం అవుతున్నాయని అన్నారు. అట్రాసిటీ కేసులకు స్టేషన్ బెయిల్ ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని వారితో అన్నారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టంలో బాధితులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారం రావడం లేదని అన్నారు సంగారెడ్డి జిల్లాలో దళిత గిరిజనుల ప్రభుత్వ అసైన్మెంట్ భూములు పెత్తందారులు రియల్ ఎస్టేట్ వ్యాపారుల కబ్జా లో ఉన్నాయని, వాటిని కబ్జాదారుల నుండి తీసుకొని తిరిగి దళిత గిరిజన రైతులకు భూములు ఇప్పించాలని అన్నారు పేదలకు వ్యవసాయం కోసం భూములు పంపిణీ చెయ్యాలి అంటే, నిలువు నీడ లేక ఉండడానికి 100 గజాల గుడిసెకు స్థలం అడిగితే భూములు లేవంటారు కానీ పెత్తందారులు రియల్ ఎస్టేట్ వ్యాపారులు మాత్రం వందలు ఎకరాల భూములు కబ్జాలకు పాల్పడుతుంటే అధికారులకు మాత్రం పట్టడం లేదని అన్నారు దళితుల గిరిజనుల ప్రభుత్వ అసైన్మెంట్ భూములకు పూర్తిస్థాయి హక్కులు కల్పించేల చర్యలు తీసుకోవాలని వారితో అన్నారుదళిత గిరిజనులపై వివక్ష దాడులు జరిగుతే సహించేది లేదు

దళిత గిరిజనులపై వివక్ష దాడులు జరిగితే చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయి అధికారుల నిర్లక్ష్యం ఉండదు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు...ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు రామ్మూర్తి నాయక్ కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అశోక్ డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్ నాయకులు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు

సంగారెడ్డి జిల్లాలో బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య.!

సంగారెడ్డి జిల్లా,ఆగస్టు09 (డైలీ రిపోర్ట్)యువకుడి వేధింపులు తాళలేక యువతి ఆత్మ హత్య చేసుకున్న సంఘటన సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దోమడుగు గ్రామానికి చెందిన తేజేశ్వని బీఫార్మసీ చదువు తోంది. తనను ప్రేమించా లంటూ అదే గ్రామానికి చెందిన యువకుడు అతని స్నేహితులతో కలిసి తరచూ విద్యార్థినినీ, ఆమె తల్లిని బెదిరింపులకు గురి చేస్తున్నారు.దీనిపై పెద్దలు జోక్యం చేసు కుని పంచాయితీ పెట్టినా వేధింపులు ఆగలేదు.. దీంతో ఏమీ తోచని పరిస్థితుల్లో ఆ యువతి తాను ఉంటున్న భవనం నాలుగు అంతస్తుల పై నుండి కిందకు దూకి ఆత్మహత్య చేసుకుంది. వెంటనే కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వారు యువ తిని ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేయగా.. మార్గ మధ్యంలో తేజేశ్వని మృతి చెందింది.. ఆత్మహత్యకు గ్రామంలోని గంజాయ్ బ్యాచ్ కారణమంటూ బంధువులు ఆందోళనకు దిగారు.. నిందితులను ఉరితీయాలం టూ డిమాండ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మవారి అనుగ్రహంతో రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

- భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న టీజీఐఐసి నిర్మల జగ్గారెడ్డి,

- సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ - చిన్న ముదిరాజ్

సంగారెడ్డి ఆగస్టు 09 (డైలీ రిపోర్ట్) : శ్రావణమాసం సందర్భంగా చార్మినార్ లోని భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి,సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బాలమురళి (చిన్న ముదిరాజ్) అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు.. భాగ్యలక్ష్మి అమ్మవారి ఆశీసులతో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకోవటం జరిగిందని తెలిపారు. గతేడాది వర్షాలు లేక రైతులు ఇబ్బందులు పడ్డారు.. అలాంటి పరిస్థితి లేకుండా వర్షాలు సమృద్ధిగా పడాలని, రైతులు సంతోషంగా ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో అక్కలి శ్రీనివా ముదిరాజ్. సాయికుమార్ ముదిరాజ్. నితీష్ ముదిరాజ్ . గాలయ్య యాదవ్ . విజయ్. మల్లేష్ యాదవ్.భువన్ నాగేంద్ర. ఈశ్వర్ . గణేష్. పాల్గొన్నారు.

కొండకల్ లో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం

శంకరపల్లి:ఆగస్ట్09:(డైలీ రిపోర్ట్) కొండకల్ గ్రామ పంచాయతీ సెక్రటరీ ఎల్లయ్య శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛదనం –పచ్చదనం కార్యక్రమం లో బాగంగ నాలుగవ రోజు గ్రామం లో ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి తనికి చేసి నీరు నిలిచిన తొట్టి లను , రోడ్ పక్కన మురిగిపోయిన వ్యర్థ పదార్థాలను ,కుళ్లిపోయిన వస్తువుల నివారణను చేపట్టారు. అనంతరం ఎల్లయ్య మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యమే మహాభాగ్యం అంటూ ఎవరు మలేరియా , డెంగ్యు మరియు వివిధ వైదులకి బానిసలు కాకుండా జాగ్రత్తలు తీసుకుంటునాము అని అన్నారు.అనంతరం మొక్కలను నాటారు.ఈ కార్యక్రమం లో ఎపిఒ భీమయ్య ,సిసి సుధాకర్ ,పంచాయతీ సెక్రటరీ ఎల్లయ్య ,మహిళా సంఘ అధ్యక్షులు,సెక్రటరీ సభ్యులు మరియు పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

శోభిత ముందు జాగ్రత్త..

ఇది మంచి నిర్ణయమే..

టాలీవుడ్ యంగ్ హీరో నాగా చైతన్య, ప్రముఖ నటి శోభిత దులిపాళ్ల ఎంగేజ్‌మెంట్ తో ఒక్కసారిగా వార్తల్లో నిలిచారు. పెద్దగా హడావుడి లేకుండా కుటుంబసభ్యుల సమక్షంలో నిశ్చితార్థం జరిగింది. నాగార్జున ఎంతో సంతోషంగా కొడుకు పెళ్లి పై స్పెషల్ ఫొటోలతో క్లారిటీ ఇవ్వడం ఓ వర్గం ఫ్యాన్స్ ను ఎంతగానో ఎట్రాక్ట్ చేసింది. అలాగే మరో వర్గం వారు ఊహించని విధంగా ట్రోల్స్ చేస్తూ ఉండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది అసలు ఈ పుకార్లకు, విమర్శలకు స్టార్స్ సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. ఒక నిర్ణయం తీసుకున్నప్పుడు వారు ఏ విధంగా ఆలోచించారు ఎన్ని రకాలుగా మాట్లాడుకుని ఉంటారు అనే అవగాహన లేకుండా మాట్లాడడం ఏమాత్రం కరెక్ట్ కాదు. లేనిపోని దుష్ప్రచారాలను సమర్ధించడానికి ఎవరికీ హక్కు లేదు. ఇక సోషల్ మీడియా ఇప్పటివరకు ఎన్నడూ లేని విధంగా రద్దీగా మారింది. ఇది నాగా చైతన్య, శోభితల మీద గట్టి ప్రభావం చూపింది. అయితే ఇలాంటి పరిస్థితే రాబోతుందనే భావనతోనే శోభిత దులిపాళ్ల ముందుగా కొన్ని చర్యలు తీసుకున్నట్లు అనిపిస్తోంది. గత మూడునెలల నుంచి ఆమె సోషల్ మీడియా ఖాతాలను డీ యాక్టివేట్ చేసుకుంది. అంతకుముందు, నాగా చైతన్యతో విడాకులు పొందిన సమయంలో ఇదే పరిస్థితిని ఎదుర్కొన్నాడు. కాబట్టి, ఈసారి శోభిత కూడా అదే మార్గాన్ని ఎంచుకున్నట్లుంది.

ఇక పర్సనల్ విషయంలో ఎవరో చేసిన కామెంట్స్ కు అనవసరంగా క్లారిటీ ఇవ్వకూడదు అని ఆ స్పెస్ కు ఆమె ముందుగానే దూరమైంది. వ్యక్తిగత విషయాలపై ఇంత రాద్దాంతం చేయడం ఎంతవరకు కరెక్ట్ అనేది ఆలోచించాల్సిన విషయం. కొంత మంది వ్యక్తిగత జీవితాలను రక్షించుకోవడానికి సోషల్ మీడియాను దూరంగా ఉంచడం ఒక సరైన మార్గం కావచ్చు. సమాజంలో వ్యక్తిగత గోప్యత పట్ల మరింత గౌరవం అవసరం, మరియు ప్రజలు తమ జీవితాలను ప్రదర్శించే ఈ మాధ్యమంలో మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మరికొందరి భావన.

రెండు కత్తులతో మహేష్..

ఆ సినిమా చేసి ఉంటే..



ఈరోజు సూపర్‌స్టార్ మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులు సోషల్ మీడియాలో ఒక ట్రెండ్ క్రియేట్ చేస్తున్నారు. హ్యాపీ బర్త్ డే మహేష్ బాబు అనే ట్యాగ్ ఒక రేంజ్ లో వైరల్ అవుతోంది. ఇక అల్ టైమ్ బెస్ట్ హిట్స్ లో ఒకటైన 'మురారి' సినిమా మళ్ళీ థియేటర్స్‌లో విడుదల చేయడం ద్వారా ఈ వేడుకలు మరింత ప్రత్యేకంగా నిలుస్తున్నాయి. మహేష్ తో సినిమాలు చేసిన నిర్మాణ సంస్థలు స్పెషల్ పోస్టర్స్ తో విషెస్ అయితే అందించారు. ఈ సందర్భంగా, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ కూడా మహేష్ బాబుకు సంబంధించిన కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో మహేష్ రెండు చేతుల్లో రెండు ఆయుధాలు పట్టుకొని పవర్ఫుల్ లుక్‌తో ఆకట్టుకున్నారు. ఈ పోస్టర్ చూసిన అభిమానులు వివిధ రకాలుగా కామెంట్స్ చేస్తున్నారు. మహేష్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్లో ఆ మధ్య రక్తపాతకథతో కూడిన చిత్రంగా అనౌన్స్ చేయబడింది. అయితే, ఆ ప్రాజెక్ట్ రద్దు చేయబడింది, దాని స్థానంలో 'గుంటూరు కారం' అనే చిత్రం తెరకెక్కింది. ఈ పోస్టర్ మహేష్ అభిమానుల్లో కొంత నిరాశ కలిగించింది. "మహేష్‌ని ఇలా గంభీరంగా చూపించే సినిమా కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నాం. ఈ సినిమా ఎందుకు రద్దు చేసి, 'గుంటూరు కారం' తీసుకున్నారు?" అంటూ ఒక అభిమాని తన ఆవేదన వ్యక్తం చేశారు.మహేష్ బాబు నుంచి ఇలాంటి ఇన్టెన్స్ యాక్షన్ చిత్రాన్ని కోరుకుంటున్న అభిమానులు, ఈ కొత్త పోస్టర్ చూసి ఆ నిరాశను పంచుకున్నారు. 'గుంటూరు కారం' చిత్రం ఒక మామూలు కమర్షియల్ సినిమా అయిందని, యాక్షన్ థ్రిల్లర్ రూపంలో మహేష్‌ని చూడాలని కోరుకుంటున్నారని అభిమాను లు భావిస్తున్నారు. ప్రస్తుతం మహేష్ ఈ లుక్ పోస్టర్‌తో తన అభిమానులను ఆకట్టుకున్నారు. ఈ పోస్టర్ మహేష్ బాబు యొక్క మునుపటి చిత్రాలకన్నా భిన్నంగా ఉండటంతో, ఆయనలోని యాక్షన్ కోణం మరింత ప్రదర్శించబడిందని అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి, మహేష్ బాబు కొత్త లుక్ పోస్టర్‌తో అభిమానుల్లో కుతూహలం నెలకొంది. ఇక మహేష్ నెక్స్ట్ రాజమౌళి దర్శకత్వంలో ఒక యాక్షన్ అడ్వెంచర్ సినిమాను తెరపైకి తీసుకు రానున్నాడు. ఈ సినిమా కోసం ఫ్యాన్స్ వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు అని చెప్పవచ్చు. ఇక దర్శకుడు రాజమౌళి మాత్రం సినిమా స్క్రిప్ట్ కోసమే చాలా ఎక్కువ టైమ్ తీసుకుంటున్నాడు.

తాప్సీ కంబ్యాక్ సీక్వెల్‌తో

ప్లాన్ చేసిందా?

తాప్సీ బాలీవుడ్ కి వెళ్లిన తర్వాత మళ్లీ టాలీవుడ్ వైపు చూసింది లేదు. మధ్యలో 'మిషన్ ఇంపాజిబుల్' అనే సినిమా చేసింది గానీ, అది ప్లాప్ అవ్వడంతో పాటు, రిలీజ్ కి ముందు పెద్దగా ప్రచారం కూడా లేకపో వడంతో ఆ సినిమా గురించి తెలిసింది తక్కువే. అలా తాప్సీ పూర్తిగా బాలీవుడ్ కే పరిమితమైంది. లక్కీగా అమ్మడు అక్కడ సక్సెస్ అయింది. టాలీవుడ్ లో ఫెయిలైనా బాలీవుడ్ మాత్రం కలిసొచ్చింది. ఆ తర్వాత మళ్లీ అమ్మడి నోట టాలీవుడ్ మాటే లేదు. అయితే తాజాగా తాప్సీ టాలీవుడ్ లో కంబ్యాక్ కి రెడీ అవుతున్నట్లు ఓ వార్త వినిపిస్తుంది. తాప్సీ ప్రధాన పాత్రలో మహి. విరాఘవ తెరకెక్కించిన 'ఆనందో బ్రహ్మ' ఎంత పెద్ద విజయం సాధించిందో తెలిసిందే. కామెడీ హారర్ థ్రిల్లర్ గా తెరకెక్కిన సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను సాధించింది. దీంతో మహి. వి. రాఘవ ఇప్పుడీ చిత్రానికి సీక్వెల్ ప్లాన్ చేస్తున్నాడు. ఇందులో మళ్లీ తాప్సీనే లీడ్ రోల్ కి ఒప్పిస్తున్నాడుట. వీలైనంత వరకూ సినిమాలో పాత పాత్రల్ని కంటున్యూ చేస్తూనే కొత్త పాత్రల్ని యాడ్ చేయాలని భావిస్తున్నారు. దీంతో తాప్సీ ఒప్పుకుంటే యధావిధిగా తన పాత్ర తనికి ఉంటుందని తెలుస్తోంది. మరి తాప్సీ ఒప్పుకుంటుందా? లేదా? అన్నది చూడాలి. ప్రస్తుతం తెలుగు సినిమా పాన్ ఇండియాలో సంచలనమవుతోంది. ఈ నేపథ్యంలో బాలీవుడ్ నటులే టాలీవుడ్ కి వచ్చి నటిస్తున్నారు. మరి తాప్సీ వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటుందా? వదులుకుంటుందా? అన్నది చూడాలి. ప్రస్తుతం అమ్మడు బాలీవుడ్ లో బిజీగా ఉన్నసంగతి తెలిసిందే.

మమ్మీ జీ సాంగ్.. అదరగొట్టిన మౌనీరాయ్

ఈ మధ్యకాలంలో హిందీ సినిమాలు తెలుగులో రిలీజ్ అయ్యి సక్సెస్ అందుకుంటున్నాయి. గత ఏడాది షారుఖ్ ఖాన్ నుంచి వచ్చిన పఠాన్, జవాన్ సినిమాలు రెండు కూడా తెలుగులో సూపర్ హిట్ అయ్యాయి. యాక్షన్ బ్యాక్ డ్రాప్ కథలతో తెరకెక్కే సినిమాలకి తెలుగులో మంచి ఆదరణ లభిస్తూ ఉంటుంది. ఇదిలా ఉంటే జాన్ అబ్రహం హీరోగా నిఖిల్ అద్వానీ దర్శకత్వంలో తెరకెక్కిన హైవోల్టేజ్ యాక్షన్ ప్యాక్డ్ మూవీ వేదా.ఎఈ సినిమా తెలుగులో కూడా అదే పేరుతో రిలీజ్ అవుతోంది. రీసెంట్ గా వచ్చిన ట్రైలర్ కి మంచి స్పందన వస్తోంది. ఆగష్టు 15న ఈ సినిమాని వరల్డ్ వైడ్ గా ప్రేక్షకుల ముందుకి తీసుకొని రాబోతున్నారు. ఇదలా ఉంటే ఈ సినిమా నుంచి తాజాగా మమ్మీ జీ అంటూ సాగే ఐటెం సాంగ్ ని ప్రేక్షకుల ముందుకి తీసుకొచ్చారు. ఈ సాంగ్ కి మనన్ భరద్వాజ్ సంగీతం అందించారు. యనమంద్ర రామకృష్ణ తెలుగులో లిరిక్స్ ని రాశారు. ఈ సాంగ్ లో మౌనీ రాయ్ గ్లామర్ షో ప్రేక్షకులకి బాగా కనెక్ట్ అయ్యింది. సాంగ్ కూడా పర్వాలేదనే టాక్ తెచ్చుకుంది. మౌనీరాయ్ కోసం ఈ సాంగ్ ని చూస్తున్నాం అంటూ మెజారిటీ తెలుగు ఆడియన్స్ కామెంట్స్ చేస్తూ ఉండటం విశేషం. దీనిని బట్టి ఈ బ్యూటీకి తెలుగులో ఎంత ఆదరణ ఉందో అర్థం చేసుకోవచ్చు.అయితే వేదా మూవీ కాన్సెప్ట్ కూడా చాలా ఇంటరెస్టింగ్ ఉందని సినీ విశ్లేషకులు అంటున్నారు. ఇందులో జాన్ అబ్రహం ఆర్మీ సోల్జర్ గా నటిస్తున్నాడు. అలాగే ఒక గ్రామంలో ప్రజలని పీడించే విలన్ కి వ్యతిరేకంగా అతను పోరాటం చేస్తాడని తెలుస్తోంది. సర్వారి, తమన్నా భాటియా ఈ చిత్రంలో హీరోయిన్స్ గా నటిస్తున్నారు. అయితే సర్వారి పాత్ర మూవీలో చాలా పవర్ ఫుల్ గా ఉండబోతోందని ట్రైలర్ బట్టి అర్థమవుతోంది. ఈ మధ్యకాలంలో సర్వారి బాలీవుడ్ వరుస సినిమాలలో అవకాశాలు సొంతం చేసుకుంటూ దూసుకుపోతోంది. అసీమ్ అరోరా వేదా సినిమాకి కథ అందించారు. గత ఏడాది షారుఖ్ ఖాన్ పఠాన్ సినిమాలో ప్రతినాయకుడిగా జాన్ అబ్రహం ప్రేక్షకుల ముందుకొచ్చారు. జీ స్టూడియోస్, ఎమ్మాయ్ ఎంటర్టైన్మెంట్, జె.ఏ ఎంటర్టైన్మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. జాన్ అబ్రహం మూవీకి నిర్మాణ భాగస్వామిగా ఉన్నారు.